

నిరుద్యోగుల పక్షాన పోరు

పట్టభద్రుల సేవే లక్ష్యం .. యువత ఆశయ సాధనకు కృషి


వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్

బహుజన బిడ్డకు పట్టం కట్టండి

ఉద్యమ ఆకాంక్షల సాధనే లక్ష్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి ఇస్మాయిల్

6



www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

శుక్రవారం | 13 | నవంబర్ | 2026 | పేజీలు: 08

పదవికి వన్నె.. ప్రజా సేవతోనే

రైతు సంక్షేమానికి పెద్దపీట!

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలి

కొల్లాపూర్ మార్కెట్ కమిటీ ఐదో పాలకవర్గం ప్రమాణ స్వీకారం

చైర్‌పర్సన్‌గా పసుపుల షమీమ్

వైస్ చైర్మన్‌గా పసుపుల నరసింహ



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి : కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఐదో పాలకవర్గం కొలువుదీరింది. నూతన చైర్‌పర్సన్‌గా పసుపుల షమీమ్, వైస్ చైర్మన్‌గా పసుపుల నరసింహతో పాటు నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు,అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో



పోస్టింగ్ ఓ చోట.. పారాలు మరోచోట!

నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ల విధులపై వివాదం....!

871 మంది విద్యార్థులున్న కళాశాలలో గణిత బోధనకు కొరత....!

నలుగురైదుగురు విద్యార్థులున్న కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్ ....!

871 మంది విద్యార్థులు ఉన్న కళాశాలలో గణితం బోధించడానికి ఒక గెస్ట్ లెక్చరర్...!

విధులు ఒకచోట.. జీతాలు మరోచోటా?

ఉన్నతాధికారుల ఆదేశాలపై విద్యార్థుల తల్లిదండ్రుల ప్రశ్నలు..!

నిజామాబాద్, అక్షిత బ్యూరో : నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో లెక్చరర్ల విధుల కేటాయింపు వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధనా సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, గణితశాస్త్ర బోధన విషయంలో జరుగుతున్న ..మిగతా 2లో

ప్రతిభతోనే ఉన్నత స్థితి

క్రీడల్లోనూ రాణించాలి

డిజిటల్ విద్య వినియోగాన్ని సద్వినియోగపరచుకోవాలి

కలెక్టర్ అనురాగ్ జయంతి



యాదాద్రి భువనగిరి/అక్షిత బ్యూరో: విద్యార్థులు చదువుతో పాటు, క్రీడా రంగాల్లోనూ ప్రతిభ కనబరిచితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం సంస్థాన్ నారాయణపూర్ మండలం సర్వేల్‌లోని గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి పాఠశాలలోని విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ..మిగతా 2లో

రైతుల పేరుతో రాజకీయ పబ్బం

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నిర్మల్, అక్షిత ప్రతినిధి : కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవాలు లేవని, రైతుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటుగా మారిందని ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సభలో రైతులు, నిరుద్యోగులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి అంశాలపై ప్రభుత్వం తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించిందని తెలిపారు. కానీ ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక సూచనలు చేయకుండా, కేటీఆర్ కేవలం రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత ఇవ్వడం ..మిగతా 2లో

పదవికి వన్నె.. ప్రజా సేవతోనే

మొదటి పేజీ తరువాయి...



మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. "పదవుల వల్ల మనిషికి వన్నె రావడం కాదు.. మనం చేసే మంచి పనులే పదవికి వన్నె తెస్తాయి. ప్రజలకు చేసే సేవ, సమాజానికి మేలు కలిగించే పనులే వ్యక్తికి గౌరవం, గుర్తింపును తీసుకొస్తాయి. పదవులు తాత్కాలికం.. ప్రజలకు చేసే సేవ ద్వారా సంపాదించుకునే గౌరవం శాశ్వతం. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాలకవర్గ సభ్యులు పదవులను హోదాగా కాకుండా బాధ్యతగా భావించి, రైతుల సంక్షేమమే ధ్యేయంగా చిత్తశుద్ధితో పనిచేయాలి" అని ఉద్బోధించారు.కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోల్లాపూర్ నియోజకవర్గం గత రెండున్నర దశాబ్దాలుగా ఎంతో అభివృద్ధి చెందిందని, కృష్ణా జలాలతో ఈ ప్రాంతం పచ్చని బీల్లుగా మారిందని చెప్పారు. రూ.100 కోట్లతో పర్యాటక, సాంస్కృతిక శాఖ నిధులతో కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, అంతేకాకుండా ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖ అద్వర్యంలో రూ. 400 కోట్లతో రహదారి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. కొందరు రాజకీయ నాయకులు ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలను పక్కనపెట్టి బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. అలాంటి విమర్శలపై తాను పెద్దగా స్పందించబోనని, వాస్తవాలేమిటో ప్రజలకు తెలుసని స్పష్టం చేశారు. విమర్శలకు సమాధానం చెప్పడం కంటే అభివృద్ధి పనుల ద్వారా ప్రజలకు మేలు చేయడానికే ప్రాధాన్యమిస్తానని పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులుగా... తాడకల జగదీశ్వర్ నాయుడు, పెద్దాపురం శ్రీను, పెదిర్దీరి లక్ష్మయ్య, నల్లవెల్లి రామస్వామి, పొనుగోటి పెద్ద కృష్ణారావు, దేశావత్ శ్రీరాములు, మెద్దెల రాందాస్, కందూరి రామచంద్రయ్య, గార్దుల మౌనిక, ఎస్. కృష్ణయ్య, బీఎస్. చాంద్ పాషా ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రతిభతోనే ఉన్నత స్థితి



మొదటి పేజీ తరువాయి...

అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానం, డార్మిటరీలను పరిశీలించారు. డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న బోధనపై విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. డిజిటల్ విద్యా విధానాన్ని సద్వినియోగం చేసుకొని చదువులో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లడుతూ త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకొని లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని సూచించారు. జీవితంలో స్థిరపడటానికి చదువు ఒక్కటే మార్గం కాదని, క్రీడలలో కూడా ప్రతిభ కనబరిచితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు.అనంతరం డైనింగ్ హాల్, వంటగదిని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఆ రోజు విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించారు , ప్రతిరోజూ నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నారా అని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి,ప్రిన్సిపాల్ సతీష్ కుమార్ జిల్లా విద్యాధికారి భిక్షపతి,తహసీల్దార్ శ్రీనివాస్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోస్టింగ్ ఓ చోట.. పాఠాలు మరోచోట!

మొదటి పేజీ తరువాయి...



పరిణామాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ముఖ్యంగా విధులు నిర్వహించే ప్రదేశం ఒకటి, జీతం పొందుతున్న ప్రదేశం మరొకటి అన్న ఆరోపణలు విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతంలో గణితశాస్త్రం బోధించేందుకు ఇద్దరు రెగ్యులర్ లెక్చరర్లు ఉండేవారు. అయితే వారిలో ఒకరు అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో మరో లెక్చరర్‌తోనే విద్యార్థులకు బోధన కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతరం టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకమైన మధు అనే రెగ్యులర్ లెక్చరర్ నిజామాబాద్ కళాశాలకు కేటాయించబడినట్లు సమాచారం. ప్రస్తుతం మధు కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితశాస్త్రం బోధిస్తున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు కమ్మర్‌పల్లి కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న నిర్మల అనే లెక్చరర్‌కు నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధించే విధంగా పరస్పర అంగీకారంతో విధుల మార్పిడి జరిగినట్లు సమాచారం. అయితే ఈ మార్పిడికి సంబంధించి ఉన్నతాధికారుల అనుమతులు, ఉత్తర్వులు ఏమిటి? ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ విధానం ఎంతవరకు సమంజసం? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

871 మంది విద్యార్థులున్న కళాశాలకు న్యాయం ఎక్కడ?

నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సుమారు 871 మంది విద్యార్థులు చదువుతున్నట్లు సమాచారం. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులున్న కళాశాలలో గణితశాస్త్ర బోధనకు రెగ్యులర్ లెక్చరర్ కొరత ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్ లో నలుగురైదుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నప్పటికీ అక్కడ రెగ్యులర్ లెక్చరర్ విధులు నిర్వహిస్తున్నారనే విషయంపై తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్ అందుబాటులో లేకపోవడం, తక్కువ మంది విద్యార్థులున్న కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్ విధులు నిర్వహించడం వెనుక ఉన్న అధికారిక కారణాలేమిటో అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

విధుల కేటాయింపుపై పారదర్శకత ఏది?

ప్రభుత్వ నియామక ఉత్తర్వుల్లో ఒక కళాశాలకు కేటాయించిన లెక్చరర్ మరో కళాశాలలో విధులు నిర్వహిస్తుంటే, అందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఉన్నాయా? విధులు నిర్వహిస్తున్న ప్రదేశానికి, జీతం పొందుతున్న ప్రదేశానికి మధ్య వ్యత్యాసం ఎందుకు ఉంది? పరస్పర అంగీకారంతో విధుల మార్పిడి చేసుకోవడానికి నిబంధనలు అనుమతిస్తున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

ప్రిన్సిపాల్ వివరణ ఇదే..

ఈ విషయంపై నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏ. ఖలీక్‌ను వివరణ కోరగా, తన ప్రమేయం ఏమీ లేదని, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే తాను నడుచుకుంటున్నానని సమాధానమిచ్చినట్లు తెలిసింది. అయితే విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఇంత కీలకమైన అంశంపై కళాశాల యాజమాన్యం బాధ్యత ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవికుమార్‌ను వివరణ కోరేందుకు సంప్రదించగా అందుబాటులోకి రాలేదులి .

జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలి

జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి లెక్చరర్ల నియామక ఉత్తర్వులు, విధుల కేటాయింపులు, హాజరు వివరాలు, జీతాల చెల్లింపులపై సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి లెక్చరర్‌కు కేటాయించిన కళాశాలలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే జిల్లాలో అందుబాటులో ఉన్న గెస్ట్ లెక్చరర్లను నిబంధనల ప్రకారం వినియోగించి, విద్యార్థులకు బోధనలో ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి విద్యార్థులు మూల్యం చెల్లించాలా? విద్యార్థుల భవిష్యత్తు కంటే విధుల మార్పిడులకే ప్రాధాన్యమా? ఈ ప్రశ్నలకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

రైతుల పేరుతో రాజకీయ పబ్బం

మొదటి పేజీ తరువాయి...



విచారకరమన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే రైతులను ప్రభుత్వం అప్రమత్తం చేసిందని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు చేసుకోవాలని సూచించిందని పేర్కొన్నారు. ప్రకృతి పరిస్థితులను కూడా ప్రభుత్వంపై నెట్టడం కేటీఆర్ రాజకీయ వైఖరికి నిదర్శనమని అన్నారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో ప్రచారం చేసుకుందే తప్ప, రాష్ట్రానికి మిగిల్చింది అప్పుల భారమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ప్రజలందరికీ తెలిసిందేనని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పకుండా నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేసిన అప్పులు, ప్రజలకు అందించిన ప్రయోజనాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. కుటుంబ రాజకీయాలు, అధికారం కోసం ఆరాటం పక్కనపెట్టి ప్రజల సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు.రైతుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ అంశం కాదు.. అది బాధ్యత. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. గత పాలనకు, ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలే అర్థం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు.

ఈ సమావేశం లో నిర్మల్ మునిసిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్, నిర్మల్ టౌన్ ప్రెసిడెంట్ ఆకుల హరీష్,ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడగల భూషణ్,డీసీసీ జనరల్ సెక్రటరీ జునైద్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సమరసింహా రెడ్డి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కట్టే శ్యామ్ నిర్మల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి చర్యలు!

లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలి

సంగెంపేట్‌లో ఇళ్ల నిర్మాణాలు, వసతులను పరిశీలించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా...





నిర్మల్,అక్షిత ప్రతినిధి నవంబర్ 12 : అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, లబ్ధిదారులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంతోనే బాధ్యత ముగియదని, లబ్ధిదారులు నివసించేందుకు అనువైన వాతావరణం, అవసరమైన సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు.

గురువారం నిర్మల్ జిల్లా సోన్ మండలం సంగెంపేట్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు అవసరమైన వసతుల కల్పనలో జాప్యం చేయకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత తప్పనిసరి

భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెంపునకు సహకరించాలని గ్రామస్థులకు వివరించారు.

అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జాబ్ కార్డుదారులకు ఉపాధి కల్పించాలి

జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ వివిజి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

ఈ పర్యటనలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, హౌసింగ్ డీఈ గంగాధర్, సర్పంచ్ విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు...

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

పింఛన్ల మంజూరులో టార్గెట్ లేదు.. అర్హతే ప్రామాణికం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య



కాజీపేట్, అక్షిత ప్రతినిధి: అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరుకు ఎలాంటి టార్గెట్ లేదని, నిబంధనల ప్రకారం అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తామని తెలిపారు. ధర్మసాగర్ మండలంలోని సుష్మిత గార్డెన్స్‌లో నిర్వహించిన చేయూత నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్, రాంపూర్ గ్రామాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు రూ.19.43 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు, 27 మంది లబ్ధిదారులకు రూ.27.03 లక్షల కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అలాగే తుర్కకాశ గ్రామానికి చెందిన 15 మంది మైనారిటీ లబ్ధిదారులకు రూ.9 లక్షల విలువైన వివిధ రకాల టూల్ కిట్లను ఎమ్మెల్యే , ఎంపీ పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీతావో శేషాద్రి, హనుమకొండ డీఆర్‌డీవో శ్రీనివాస్, తహసీల్దార్ భావ్ సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక చేయూత నిచ్చిన

తెలంగాణ రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామానికి చెందిన జల్లెల మణెమ్మ,శ్రీనివాస్ దంపతుల కుమార్తె మేఘన వివాహం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి 10,000/-వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలవడం,ఆడబిడ్డల వివాహాలకు తమ వంతు సహకారం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడం ద్వారా వారి జీవితాల్లో కొంతైనా ఆనందం నింపవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,మాజీ ఎంపీటీసీ నాగులు నాయక్, మాజీ సర్పంచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

మాజీ సర్పంచ్ కుటుంబానికి లోలం శ్యాంసుందర్ పరామర్శ

కనకాపూర్‌లో చిన్ని కుమార్ మృతి పట్ల సంతాపం.. కుటుంబ సభ్యులకు ఓదార్పు



లోకేశ్వరం, నవంబర్ 12 అక్షిత న్యూస్ : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ నీరడి సాగర భర్త చిన్ని కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్,బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు లోలం శ్యాంసుందర్ పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను కలిసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్ని కుమార్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో లోకేశ్వరం మండల బీఆర్ఎస్ కన్వీనర్ కరిపే శ్యాంసుందర్, జోహార్‌పూర్ మాజీ సర్పంచ్ దిగంబర్, బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా కన్వీనర్ బండి ప్రశాంత్,ఓరగంటి బాబన్న, ఇర్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు...

నేపాల్, టిబెట్‌కు చెందిన స్వెటర్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభము

వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి





కాజీపేట్, అక్షిత ప్రతినిధి : హనుమకొండ అశోక జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నేపాల్, టిబెట్‌కు చెందిన స్వెటర్ విక్రయ కేంద్రాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. జీవనోపాధి కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారాలు నిర్వహిస్తున్న నేపాల్, టిబెట్ ప్రాంతాల వారికి మనమంతా అండగా నిలవాలని అన్నారు. ప్రతి సంవత్సరం వారు ఇక్కడికి వచ్చి స్వెటర్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు.

వారు మన సమాజంలో భాగమై, మనతో కలిసిమెలిసి జీవిస్తున్నారని, వారి జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. స్థానికులుగా వారికి ప్రోత్సాహం అందించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ వేడుకలో ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్థానిక డివిజన్ అధ్యక్షులు శ్యామ్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట యూనియన్ అధ్యక్షుడు బోగే రాజేందర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా నాయకులు, కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి నాలుగేళ్లుగా వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందించాలని కోరారు. చట్టబద్ధమైన సెలవులు, వార్షిక బోనస్, రెండు జతల యూనిఫారాలు కల్పించడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును కార్మికుల ఖాతాల్లో సక్రమంగా జమ చేయాలని డిమాండ్ చేశారు.తమ సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 12 నుంచి 28వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్రభుత్వ ఆసుపత్రుల ఎదుట గంటపాటు నిరసనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరత్నంకు వినతిపత్రం అందజేసి, నిరసనలకు సహకరించాలని కోరినట్లు పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు..

బుచ్చిరెడ్డి మృతి పట్ల సాయిరాం మెడికల్ షాప్ రామన్న సంతాపం



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని వితాయిపల్లి గ్రామంలో మృతి చెందిన బుచ్చిరెడ్డి పార్థివదేహానికి ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు,సాయిరాం మెడికల్ షాప్ నిర్వాహకులు రామన్న పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ,ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సమాజంలో సేవా కార్యక్రమాలతో పాటు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవతా విలువలకు ప్రాధాన్యతనిస్తున్న రామన్న సేవాభావాన్ని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి కుమారుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి రామాయణ మిత్ర మండలి సభ్యులు నూతనగంటి భాస్కర్ రాకేష్ తదితరులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

జొటోసోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను సకాలంలో చెల్లించాలి

అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు మధుసూదన్ నాయక్

వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

పెండింగ్ వేతన బకాయిల వివరాలు సమర్పించాలి



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: జొటోసోర్సింగ్ ఏజెన్సీల ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఈ మేరకు ఐడీఓసీ లో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌తో కలిసి వివిధ జొటోసోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జొటోసోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా చెల్లించాల్సిన వేతనాలు, చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఏజెన్సీల వారీగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిల వివరాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ శాఖల్లో జొటోసోర్సింగ్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి అందాల్సిన వేతనాలను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం నిర్దిత గడువులోగా తప్పనిసరిగా చెల్లించాలని ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. వేతనాల చెల్లింపులో ఎలాంటి జాప్యానికి తావులేకుండా చూడాలని, ఉద్యోగుల వేతన సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి జొటోసోర్సింగ్ ఏజెన్సీ తమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల పూర్తి వివరాలతో పాటు, వారికి చెల్లించాల్సిన వేతనాలు, ఇప్పటికే చెల్లించిన వేతనాలు, పెండింగ్‌లో ఉన్న బకాయిలకు సంబంధించిన వివరాలను సమర్పించాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు.

జొటోసోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేతనాల చెల్లింపును సక్రమంగా పర్యవేక్షించాలని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మైత్రీ ప్రియ, వివిధ జొటోసోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ ఉర్సులోని బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించిన కలెక్టర్



వరంగల్, అక్షిత బ్యూరో: వరంగల్ ఉర్సులోని మహాత్మా జ్యోతిరావు ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న ఆరోగ్య సంరక్షణ సేవలు, పౌష్టికాహారం నాణ్యత తీరును పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న ఆహారం, వసతి సౌకర్యాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, ఆహారం అందించే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలెక్టర్ ముచ్చటిస్తూ చలికాలంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చలి నుంచి రక్షణ పొందేందుకు తగిన వెచ్చని దుస్తులు ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురుకులంలో ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే వాటిని తన దృష్టికి తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్స్ ద్వారా తెలియజేయాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను తెలియజేయాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పర్యటనలో బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత రెడ్డి ,ప్రిన్సిపాల్ అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో విద్యార్థుల హోరాహోరీ పోరు!

ఎస్.ఆర్.ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో అట్టహాసంగా'ఏపెక్స్ 2కే26

అంతర్ పాఠశాలల క్రీడా పోటీలకు శ్రీకారం..

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు ఎంతో కీలకం డీజీఎం గోవర్ధన్ రెడ్డి





నిర్మల్,అక్షిత ప్రతినిధి నవంబర్ 12 : నిర్మల్ జిల్లా ఒకవైపు గెలుపే లక్ష్యంగా పరుగులు.. మరోవైపు విజయం కోసం హోరాహోరీ పోరు.. ఇంకోవైపు విద్యార్థుల కేరింతలు.. ఇలా క్రీడా ఉత్సాహం, పోటీతత్వం మధ్య ఎస్.ఆర్. ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు 'ఏపెక్స్ 2కే26' ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అకాడమీ డీజీఎం గోవర్ధన్ రెడ్డి, డీన్ రాంబాబు, జోనల్ ఇన్‌చార్జ్ శిరీష, ప్రిన్సిపాల్స్ సుధాకర్, అర్చన తదితరులు హాజరై క్రీడా పోటీలను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాల్లో క్రీడలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. క్రీడలు విజయస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణను పెంపొందించడమే కాకుండా నాయకత్వ లక్షణాలను వెలికితీస్తాయని వివరించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభాపాటవాలను చాటుకున్నారు. ప్రతి పోటీలోనూ గెలుపు కోసం విద్యార్థులు ప్రదర్శించిన పట్టుదల, జట్టుగా ఆడిన తీరు ఆకట్టుకున్నాయి. మైదానమంతా క్రీడా సందడితో సందడిగా మారింది. విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభను గుర్తించి, వారిని విద్యతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఎస్.ఆర్. ఎడ్యుకేషనల్ అకాడమీ చేస్తున్న కృషికి 'ఏపెక్స్ 2కే26' వేదికగా నిలిచింది...

విద్యార్థుల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మందమర్రి, అక్షిత ప్రతినిధి: ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండలంలోని ప్రాంతాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల కు మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. పాఠశాలలకు అవసరమైన బెడ్స్ ఇంకా అందుబాటులోకి రాలేదని గుర్తించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే బెడ్స్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన పరుపులతో పాటు బెడ్స్‌ను కూడా త్వరగా ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించాలని, వంటశాల, భోజనశాలను పరిశుభ్రంగా నిర్వహించాలని, అవసరమైన అన్ని వసతులు సమకూర్చుకోవాలని సూచించారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను నాయబ్ తహసిల్దార్ అంజయ్యతో కలిసి పరిశీలించి, సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రీ సర్వే సిబ్బంది ఉదయం వేళల్లోనే క్షేత్రస్థాయికి చేరుకొని పనులు ప్రారంభిస్తే ఎక్కువ భూమిని సర్వే చేయడానికి అవకాశం ఉంటుందని, తద్వారా పనులు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని తహసిల్దార్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ భూ ఆక్రమణలకు అవకాశం కల్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాపూర్ గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేసి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించడంపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించాలని, సెలవుల అనంతరం విద్యార్థులందరూ తిరిగి పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి మండలాల తహసిల్దార్లతో భూ రీ సర్వే, జి.ఓ. నంబర్ 59, 76 అమలు, భూభారతి డిజిటల్ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత దరఖాస్తులు, సర్వే పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సింగరేణి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలు, జి.ఓ. నంబర్ 76 క్రింద చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. భూ రీ సర్వే పనులు వేగంగా పూర్తయ్యేలా తహసిల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, సర్వే సిబ్బంది ఉదయాన్నే గ్రామాలకు చేరుకొని పనులు ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్, సోషల్ మీడియా పట్ల యువత జాగ్రత్తగా ఉండాలి

వరంగల్ క్రైమ్ ఏసిపి సదయ్య



వరంగల్, అక్షిత బ్యూరో: ర్యాగింగ్ పట్ల యువత దూరంగా ఉండాలని క్రైమ్ ఏసిపి సదయ్య అన్నారు.కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ పై అవగాహన సదస్సులో పాల్గొన్న క్రైమ్ ఏసిపి సదయ్య మాట్లాడుతూ మెడికల్ విద్యార్థిని విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని ఎవరైనా సైగలు చేసిన నేరుగా కళ్ళల్లో కళు ళు పెట్టి చూసిన అపహాస్యం చేసిన నేరుగా యాంటీ ర్యాగింగ్ కమిటీకి కంప్లైంట్ చేయాలని కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థిని విద్యార్థుల ర్యాగింగ్ కన్నా ఇప్పుడు ప్రధానంగా ప్రొఫెసర్స్ మెడికల్ విద్యార్థినిల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

ఎక్కువగా విద్యార్థిని విద్యార్థులు ఫేస్బుక్ ,వాట్సప్, ఇన్స్టాగ్రామ్ ,స్నాప్ చాట్ వీటి ప్రలోభాలకులోనై ఇబ్బందులు పడి షీ టీమును ఆశ్రయిస్తున్నారని ఎక్కువగా ఇటువంటి కేసులే వస్తున్నాయి కాబట్టి సోషల్ మీడియాను సరి అయిన పద్ధతిలో ఉపయోగించుకోవాలని పరిచయం లేని వ్యక్తులకు లైకులు కొట్టడం ఇంస్టాగ్రామ్ లో ముక్కు మొహం తెలియని వ్యక్తులను ఫాలో కావడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలియజేశారు. కే ఎంసి ప్రిన్సిపల్ మోహన్ దాస్ మాట్లాడుతూ ర్యాగింగ్ చేసేవారిని కాలేజ్ నుంచి డిబార్ చేయడమే కాకుండా వారిపై కేసులు కూడా పెట్టడం జరుగుతుందని మహిళా స్టూడెంట్స్ ఇటువంటి సమస్యలు ఉన్న యాంటీ ర్యాగింగ్ కమిటీకి దృష్టికి లేదా పేరెంట్స్ కు గాని ప్రిన్సిపల్ గాని పోలీస్ వారికి గాని ఫిర్యాదు చేయాలని తెలిపారు. మట్టవాడ సీఐ కరుణాకర్ రావు మాట్లాడుతూ ర్యాగింగ్ చేసిన వారికి ఎటువంటి పనిష్మెంట్ ఉంటుందో ర్యాగింగ్ చట్టం గురించి తెలిపారు. షీ టీం ఎస్ఐ రామారావు మాట్లాడుతూ 2014వ సంవత్సరంలో షీ టీం హైదరాబాదులో ఏర్పాటు చేశారని 2015 సంవత్సరంలో వరంగల్ హనుమకొండ కాజీపేట జనగాం నర్సంపేటలో సి టీం ఏర్పాటు చేయడం జరిగిందని షీ టీం ఫిర్యాదు చేసిన వెంటనే సమస్య పరిష్కరించ బడుతుందని ఆకతాయిల పట్ల గాని ర్యాగింగ్ వల్ల గాని గురైన వారు షీ టీం నెంబర్ 8712685142 సిపి నెంబర్ 8712685 157 లేదా డయల్ 112 కు ఫిర్యాదు చేయాలని ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు తప్పనిసరిగా టి సేఫ్ ఆప్ ఉపయోగించుకోవాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో భరోసా కౌన్సిలర్ తేజశ్రీ,ప్రొఫెసర్ కాత్యాయని డా, పద్మిని సౌజన్య డా ఎల్ మురళి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

ఇప్పటికీ తెరుచుకొని వడ్ల కొనుగోలు కేంద్రాలు



చేర్యాల అక్షిత ప్రతినిధి: చేర్యాల మండలంలోని కొన్ని గ్రామాలలో ఐకెపి మరియు సివిసిఎస్ ద్వారా ఇప్పటికీ వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని చేర్యాల పట్టణ బిఆర్ఎస్ 12వ వార్డ్ ఇన్చార్జి శివగారి అంజయ్య అన్నారు.ఈ సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని తెచ్చుకొని కల్లాలల్లో రోజుల తరబడి ఎదురు చూడడం జరుగుతుంది.ఇంతవరకు వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాలాగోతనానికి నిదర్శనం అని అన్నారు.రైతులు వ్యవసాయానికి నీరు లేక,కరెంటు కష్టాలతో పంటలు ఎండిపోయి నష్టాల పాలవుతుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం సభలు సమావేశాలతో గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కాలం వెల్లదిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా స్పందించి వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వ అధికారులను కోరారు. లేనియెడల రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు చింతల పరశురాములు, యూత్ అధ్యక్షులు యాట బిక్షపతి, కొమురవెల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ అమర్ గౌడ్, నాయకులు రాచకొండ శ్రీనివాస్, శనిగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి బీజేపీని సంసాగతంగా బలోపేతం చేదాం

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జీ



షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా బీజేపీ పదాధికారుల సమావేశం శంషాబాద్ సమీపంలోని నర్కుడ రోడ్డులో ఉన్న బ్యూటీ గ్రీన్ పార్క్ రిసార్ట్‌లో జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజు భూపాల్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జీ, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, జిల్లా ఇన్‌చార్జి రఘునాథరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుకర్ జీ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసినప్పుడే పార్టీ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, కక్కునూరి వెంకటేష్ గుప్తా, అమలాపురం నర్సింలు గౌడ్, నవీన్ మాల, విట్యాల నర్సింలు, మోహన్ సింగ్ నాయక్, దేపల్లి అశోక్ గౌడ్‌తో పాటు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, పిట్టల సురేష్, శ్రీనివాస్ చారి, శ్రీనివాస్ గుప్తా, అరవింద్ కుమార్, మహేందర్ రెడ్డి, గట్టు విజయ్ తదితరులు పాల్గొన్నారు..

భూపాలపల్లిలో ఘనంగా బొగ్గు నాణ్యత వారోత్సవాలు



అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: విద్యుత్ రంగంలో పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, సరఫరాకు సింగరేణి సంస్థ ప్రాధాన్యం ఇస్తున్నట్లు భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ డి. శ్యామ్ సుందర్ అన్నారు..

గురువారం భూపాలపల్లి ఏరియాలో బొగ్గు నాణ్యత వారోత్సవాలు-2026 ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జీఎం కార్యాలయ ఆవరణలో బొగ్గు నాణ్యత పతాకాన్ని ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ డి. శ్యామ్ సుందర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు వెలికితీత నుంచి సార్టింగ్, సైజింగ్, నిల్వ, లోడింగ్, రవాణా వరకు ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, బొగ్గులో మట్టి, బండరాళ్లు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నాణ్యత అనేది ఒక విభాగానికి మాత్రమే పరిమితం కాదని, ప్రతి ఉద్యోగి సమష్టి బాధ్యతగా భావించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఉద్యోగులతో నాణ్యత ప్రతిజ్ఞ చేయించారు. వారోత్సవాల్లో భాగంగా ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో నాణ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు...

ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రమణ్ వీ. పాఠక్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యామ్ సుందర్, ఏఐటీయూసీ నాయకుడు మోటపలుకుల రమేశ్, ఐఎన్‌టీయూసీ నాయకుడు బి. మధుకర్ రెడ్డి, సీఐఎంఓఏ ప్రతినిధి ప్రదీప్, క్వాలిటీ ఇన్‌చార్జి మేనేజర్ కుమారస్వామి, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు..

పేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్

అనారోగ్య బాధితునికి చెక్కు అందజేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన పభాతి రామస్వామి అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందిన అనంతరం, సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) కోసం దరఖాస్తు చేసుకున్నారు.ఈ క్రమంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.18,000 ఆర్థిక సాయం మంజూరైంది.గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.18,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం రామస్వామి కి అందజేశారు.

ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సింగం విజయ్ గౌడ్,వెల్దండ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్టారామిరెడ్డి,మాజీ ఎంపీటీసీ లు నాగులు నాయక్,లింగం,రాములు,ఎల్లికల్ సర్పంచ్ కృష్ణ,వార్డు సభ్యులు సునీత ఆనంద్, నరేష్,నాయకులు తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి,రమేష్,ప్రవీణ్,రవి,సుమన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు...

నిరుద్యోగుల పక్షాన పోరు

పట్టభద్రుల సేవే లక్ష్యం

యువత ఆశయ సాధనకు కృషి

వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్

బహుజన బిడ్డకు పట్టం కట్టండి ఉద్యమ ఆకాంక్షల సాధనే లక్ష్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి ఇస్మాయిల్



వరంగల్, అక్షిత బ్యూరో: నిరుద్యోగ యువత ఆశయాల సాధనకు, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ రక్షణ సేన వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా పోరాడిన తనకు యువత, నిరుద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. సామాజిక న్యాయం, బహుజన వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా తనకు ఒక్క అవకాశం కల్పించాలని పట్టభద్రులను విజ్ఞప్తి చేశారు.

కాకతీయ విశ్వవిద్యా లయంలో విద్యనభ్యసించి పీహెచ్‌డీ సాధించిన తాను ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని, పేదరికం నుంచి వచ్చిన వ్యక్తిగా సామాన్యులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన బహుజన బిడ్డగా తనను ఆశీర్వదించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. గతంలో హామీలిచ్చి గెలిచిన కొందరు ప్రజాప్రతినిధులు పాలక పక్షాలకు అనుకూలంగా మారారని, తాను మాత్రం ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాడతానని స్పష్టం చేశారు.

తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహుజన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని, మహబూబాబాద్ ప్రాంతానికి చెందిన బీసీ బిడ్డకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారని ఎన్నికల ఇన్‌చార్జి ఇస్మాయిల్ తెలిపారు. వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రులు శ్రీకాంత్ గౌడ్‌కు మద్దతుగా నిలిచి బహుజన బిడ్డను గెలిపించాలని, తద్వారా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనకు తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి ఉద్యమకారులను విస్మరించిందని విమర్శించారు. ఉద్యమంలో సర్వం కోల్పోయిన వారిని పక్కనపెట్టి, ఆర్థిక, అంగబలం ఉన్నవారికే రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. విద్యార్థి ఉద్యమకారుల ఆశయాలను పట్టించుకోకుండా వారికి అన్యాయం చేసిందని అన్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ, వాటి అమలులో విఫలమైందని విమర్శించారు.



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను నిరాశపరిచిందని అన్నారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వేలు, పోస్టల్ శాఖతో పాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తూ ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర ప్రాంతాల వారికి అవకాశాలు కల్పించడం వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆశీర్వాదంతో తనకు లభించిన ఈ అవకాశాన్ని ప్రజాసేవకు వినియోగిస్తానని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. అశోక్‌నగర్‌లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ నిరుద్యోగ యువత పడుతున్న ఇబ్బందులు తనకు తెలుసని, వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే క్షేత్రస్థాయిలో వారి వెంట ఉంటూ, తమ సమస్యలను పరిష్కరించుకునేలా బాధ్యతతో పనిచేస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి వీర బిక్షపతి, జిల్లా అధ్యక్షుడు మాడిపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి మాడుల రాజిరెడ్డి, జిల్లా నాయకులు శ్రీశైలం, సుమన్ సుతేజ్ రవి, రాధాకృష్ణ రమాదేవి, రవికుమార్, సోల్తి కిషోర్, నిశాంత్ రావు, చిలుక ప్రవీణ్, విద్యార్థి నాయకులు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

దేపల్లి గ్రామంలో భూ రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం దేపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో భూ రీసర్వే పనుల పురోగతిని సమీక్షించారు. పట్టా వ్యవసాయ భూములు, ప్రభుత్వ భూములు, ఇతర భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఇప్పటికే ఉన్న రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి భూముల విస్తీర్ణాలు, సరిహద్దులను తనిఖీ చేశారు. సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణాలు, భూముల వర్గీకరణ వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడి భూ రీసర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. రీసర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని ముందుగానే పట్టాదారులకు తెలియజేయాలని, సర్వే సమయంలో వారు తమ తాజా భూ రికార్డులతో అందుబాటులో ఉండేలా చూడాలని సర్వే బృందానికి సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత పట్టాదారులకు వారి భూముల తుది సర్వే విస్తీర్ణాలను తెలియజేయాలని ఆదేశించారు.

రైతులతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి భూ రీసర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, ఖచ్చితత్వంతో నిర్వహించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు ఆస్కారం లేకుండా సర్వే పనులను పకడ్బందీగా, నిర్దీత పద్ధతిలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ పరిశీలనలో జిల్లా సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు అశోక్, నవాబుపేట తహసీల్దార్ సురేష్, .డిప్యూటీ తహశీల్దార్ సువర్ణ,డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే మూసా,మండల సర్వేయర్ అహ్మద్, సంబంధిత సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట్ మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం.. రేషన్ షాప్‌ల ప్రారంభోత్సవాలు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: కేశంపేట్ మండలంలోని దేవునిగుడి తండా, రాగ్యతండా, చింతకుంటపల్లి, పాటిగడ్డ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో నూతన రేషన్ దుకాణాల ప్రారంభోత్సవాలు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు.

దేవునిగుడి తండాలో రేషన్ షాప్ ప్రారంభం.. 40 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

దేవునిగుడి తండా గ్రామ పంచాయతీలో చౌకధరల పంపిణీ దుకాణం సెకండ్ సేల్ పాయింట్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా 40 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.అదేవిధంగా రాగ్యతండాలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన పైప్‌లైన్, గేట్ వాల్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి అవసరమైన కుర్చీలు, బీరువా, జమఖానాలు అందిస్తానని తెలిపారు.

చింతకుంటపల్లిలో నూతన రేషన్ షాప్ ప్రారంభం.. 54 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

చింతకుంటపల్లి గ్రామ పంచాయతీలో నూతన రేషన్ డీలర్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 54 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా సంఘ భవనం నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని, మహిళా సంఘాల సమావేశాల నిర్వహణకు కుర్చీలు, జమఖానాలు అందిస్తానని తెలిపారు.

పాటిగడ్డలో రేషన్ షాప్ ప్రారంభం.. 37 మందికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పాటిగడ్డ గ్రామ పంచాయతీలో నూతన రేషన్ డీలర్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం 37 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వారు సమావేశాలు నిర్వహించుకోవడానికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమాల్లో కొత్తపేట సింగిల్ విండో చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర రెడ్డి, తహశీల్దార్ రాజేందర్ రెడ్డి, కేశంపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ అప్పా, బాలరాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వీరేశ్, నందిగామ సింగిల్ విండో చైర్మన్ చంద్రపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ జాంగారి రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, కల్లు సాయిలు, గ్రామాల సర్పంచులు సుజాత, శశిరేఖ, భాస్కర్ గౌడ్, శ్యామల అఖిల్, పోచామొని రమేష్, పల్లె ఆనంద్, నాగేశ్వర్, కొట్టం నరేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అనసూయ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జితేందర్ రెడ్డి, కరణకర్ రెడ్డి, తుపాకుల శేఖర్, ముబారక్, నీతారాం, అన్నారం బాలు నాయక్, వేముల్ నర్వ మల్లేష్, గోపానీ భీమయ్య, కాకునూర్ లింగం, శ్రీనాథ్, రమేష్, వంశీ గౌడ్, సుదర్శన్, కృష్ణయ్య, సరికొండ రమేష్, యాదగిరి, కోడూరు రాములు, చిర్ర శ్రీను తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలి

కృషి సఖీలకు ఐదు రోజుల శిక్షణ పూర్తి.. సర్టిఫికెట్ల ప్రదానం | సేంద్రీయ ధ్రువీకరణ, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కల్పించాలి: డీఏఓ అంబికా సోనీ

కార్యాక్రమంలో పాల్గొన్న. డి ఆర్ డి ఓ , డి ఆర్ డి ఏ శ్రీ ఆర్ భాస్కర్

జనగామ అక్షిత బ్యూరో : ప్రకృతి వ్యవసాయాన్ని రైతులకు మరింత చేరువ చేసి, రసాయన రహిత సాగు వైపు వారిని మళ్లించేందుకు కృషి సఖీలు కీలక పాత్ర పోషించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి శ్రీమతి అంబికా సోనీ సూచించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న కృషి సఖీలకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి అంబికా సోనీ, డి ఆర్ డి ఓ, డీఆర్డీఏ శ్రీ ఆర్ . భాస్కర్ పాల్గొని శిక్షణ పూర్తి చేసిన కృషి సఖీలకు ధ్రువపత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా డీఏఓ అంబికా సోనీ మాట్లాడుతూ.. ప్రతి కృషి సఖీ తమ పరిధిలో 125 మంది రైతులను ఎంపిక చేసుకుని, వారిని ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా కృషి చేయాలని ఆదేశించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా కలిగే లాభాలను వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. వాతావరణ మార్పుల ప్రభావం, ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో చోటుచేసుకునే మార్పులపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు స్థిరమైన, తక్కువ పెట్టుబడితో కూడిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా కృషి చేయాలన్నారు.

సర్టిఫికేషన్‌తో అదనపు విలువ

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి మార్కెట్ కల్పించేందుకు సేంద్రీయ ధ్రువీకరణ సర్టిఫికేషన్ ప్రాధాన్యతను రైతులకు వివరించాలని డీఏఓ సూచించారు. పంటలు పండించడం మాత్రమే కాకుండా, వాటికి ధ్రువీకరణ పొందడం, సరైన మార్కెటింగ్ విధానాలను అవలంబించడం ద్వారా రైతులు తమ ఉత్పత్తులకు మెరుగైన ధర పొందేలా మార్గనిర్దేశం చేయాలని తెలిపారు.



మహిళా సంఘాల ద్వారా విస్తృత ప్రచారం

డి ఆర్ డి ఓ , డి ఆర్ డి ఏ శ్రీ ఆర్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి కృషి సఖీ తమ తమ మహిళా సంఘాల వీఓ (ఎం) సమావేశాల్లో ప్రకృతి వ్యవసాయంపై చర్చించి, సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా సంఘాల సహకారంతో ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు.

కార్యక్రమంలో ఏపీడీ నూరోద్దీన్,ఏడీఏ వసంత, డి పీఎం నళిని, మారి సంస్థ ప్రతినిధులు మారపాక వెంకటస్వామి, గాండ్ల రాజు, చాగంటి నరేష్, వెంకట వంశీ, రావుల రాజేందర్, పాటు వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, సిబ్బంది, కృషి సఖీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



రామన్నపేట, అక్షిత ప్రతినిధి: రామన్నపేట గ్రామంలో చేపడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో రాములు పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా నిర్దేశించిన పనులు కల్పించడంతో పాటు, పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా చూడాలని సూచించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, ఏపీవో వెంకన్న, ఏపీవో రఫీ, పంచాయతీ కార్యదర్శి సైదిరెడ్డి, కరోబార్ ప్రవీణ్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చుంచన కోటలో నీటి తొట్టిల ఏర్పాటుకు ముహూర్తం



చేర్యాల అక్షిత ప్రతినిధి: చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ సమక్షంలో గురువారం ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రస్తుతం వీబిజి రామ్ జి పథకం లో భాగంగా కమ్యూనిటీ నీటి తొట్టెల (క్యాటిల్ ట్రాఫ్స్) నిర్మించుట గాను ముగ్గు పోసి ముహూర్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో రోడ్ల వైపున నీటి తోట్టిలను ఏర్పాటు చేయడం వల్ల అన్ని కాలాలలో, ముఖ్యంగా వేసవిలో పశువులకు, పక్షులకు నీటి దాహం తీర్చుకోవడానికి ఉపయోగపడతాయని సర్పంచ్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీవో దివ్య, టెక్నికల్ అసిస్టెంట్ రాజకుమార్, పంచాయతీ సెక్రెటరీ రాంబాబు, ఉప సర్పంచ్ వట్టిపల్లి ఆగయ్య , శీర్ల శ్రీకాంత్, మంద వెంకట రెడ్డి, మరియు వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు. ఊరిలో రోడ్ల వైపున ఈ నీటి తోట్టెలు ఏర్పాటు చేస్తే అన్ని కాలాల లో ముఖ్యంగా వేసవిలో పశువులకు పక్షులకు గాని నీటి దాహం తీరడానికి ఉపయోగపడతాయని సర్పంచ్ గారు వాటి ప్రాముఖ్యత వివరించారు.

జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఉపాధి పనులకు హాజరు కావాలి

ఎంపీడీవో విజయలక్ష్మి



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఉపాధి పనులకు హాజరు కావాలని ఎంపీడీవో విజయలక్ష్మి సుశించారు. లింగాల మండలం దారారం గ్రామంలో గ్రామ సర్పంచ్ శ్రీను నాయక్ తో కలిసి ఉపాధి పనులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వి బిజీ రాంజీ పథకంలో భాగంగా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా వలసలు వెళ్లకుండా స్థానికగా పనులు చేసుకోవాలని సుశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి శ్రీను నాయక్. ఉపాధి హామీ ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్, మరియు కార్యదర్శి మతృ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్న ఆధ్వర్యంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన సందర్భంగా ఆర్.ఎస్.పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 21 నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ వాల్ పోస్టర్ ఆవిష్కరణని హైదరాబాద్ కర్మన్ఘాట్ లోని ఉప్పల వెంకటేష్ అన్న నివాసంలో ఆవిష్కరించడం ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్ తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం శుద్ధపల్లి మాజీ ఎంపీటీసీ వెంకటయ్య మంగళపల్లి మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి ఆర్ఎస్పీ ఫౌండేషన్ డైరెక్టర్ అశ్విన్ కుమార్ బోర్డు సభ్యులు బండగల చందు కిరణ్ సింగపాకుల రాము మహేష్ కోప్పు యాదగిరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ కారు యాక్సిడెంట్



షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న కాకా మూవీ షూటింగ్ ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ వద్ద శేఖర్ మాస్టర్ కారును ఢీకొట్టిన పండ్ల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్.. ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ శేఖర్ మాస్టర్, సిబ్బంది.

ఖమ్మం మైనారిటీ గురుకుల గర్ల్స్ 2 ప్రిన్సిపాల్‌కు సీతా మహాలక్ష్మి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు

సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సీతా మహాలక్ష్మి



ఖమ్మం /అక్షిత బ్యూరో : తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాలలు కళాశాలల విభాగంలో ఉత్తమ ప్రిన్సిపల్ గా ఖమ్మం మైనారిటీ గర్ల్స్--2 ప్రిన్సిపాల్ పొలిమెట్ల సీతా మహాలక్ష్మి ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నవంబర్ 11న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ బంజార భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆమె ఉత్తమ ప్రిన్సిపల్ గా అవార్డును అందుకున్నారు.

విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపు క్రమశిక్షణ విద్యార్థినుల సంక్షేమము సమగ్ర అభివృద్ధికి ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

ఈ పురస్కారంతో ఖమ్మం జిల్లా మైనారిటీ గురుకుల విద్యాసంస్థ కు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీతా మహాలక్ష్మిని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్ రీజినల్ లెవల్ కో-ఆర్డినేటర్ కె వెంకట రామయ్య, విజిలెన్స్ అధికారులు సీతారాములు రావుఫ్ ఇతర గురుకులాల ప్రిన్సిపల్స్ అధ్యాపకులు ఉపాధ్యాయులు విద్యాసంస్థల సిబ్బంది విద్యార్థినులు పలువురు విద్యావేత్తలు అభినందనలు తెలియజేశారు.

విద్యా రంగంలో ఆమె అందిస్తున్న సేవలు మరింత మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పలువురు ఆకాంక్షించారు.

జొటసోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను సకాలంలో చెల్లించాలి

అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు మధుసూదన్ నాయక్

వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

పెండింగ్ వేతన బకాయిల వివరాలు సమర్పించాలి



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఈ మేరకు ఐడీఓసీ లో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌తో కలిసి వివిధ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా చెల్లించాల్సిన వేతనాలు, చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఏజెన్సీల వారీగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిల వివరాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి అందాల్సిన వేతనాలను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా చెల్లించాలని ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. వేతనాల చెల్లింపులో ఎలాంటి జాప్యానికి తావులేకుండా చూడాలని, ఉద్యోగుల వేతన సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ తమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల పూర్తి వివరాలతో పాటు, వారికి చెల్లించాల్సిన వేతనాలు, ఇప్పటికే చెల్లించిన వేతనాలు, పెండింగ్‌లో ఉన్న బకాయిలకు సంబంధించిన వివరాలను సమర్పించాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేతనాల చెల్లింపును సక్రమంగా పర్యవేక్షించాలని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మైత్రీ ప్రియ, వివిధ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో భారీ అగ్నిప్రమాదం

ఎస్కే కుర్చీల కంపెనీలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు.. కళ్లముందే బూడిదైన కుర్చీలు, భారీ సామగ్రి

తప్పిన పెను ప్రమాదం.. కార్మికులు సురక్షితం.. తప్పిన ప్రాణనష్టం



షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. గ్రామంలోని ఎస్కే కుర్చీల కంపెనీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో స్థానికంగా తీవ్ర ఆందోళన నెలకొంది.

కంపెనీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి క్షణాల్లోనే వ్యాపించడంతో అక్కడ నిల్వ ఉంచిన కుర్చీలు, బల్క్ సామగ్రి మంటలకు ఆహుతైనట్లు సమాచారం. మంటల తీవ్రతతో కంపెనీ పరిసర ప్రాంతాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. అగ్నిప్రమాదాన్ని గమనించిన కార్మికులు వెంటనే అప్రమత్తమై బయటకు రావడంతో పెను ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న స్థానికులు తక్షణమే స్పందించి పోలీసులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. సకాలంలో స్పందించడంతో పరిస్థితిని నియంత్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

అయితే ఈ అగ్నిప్రమాదం ఎలా సంభవించింది? ఎంత మేర ఆస్తి నష్టం వాటిల్లింది? అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారుల విచారణ అనంతరం ప్రమాదానికి గల అసలు కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మంటలు భారీగా ఎగిసిపడినా.. ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు

తంగడపల్లిలో వార్డు కమిటీలు,నూతన బూత్ కమిటీల ఏర్పాటు

5వ వార్డు అధ్యక్షుడిగా బండి చంటి ముదిరాజ్,

6వ వార్డు అధ్యక్షుడిగా రావుల ఊషయ్య ఎన్నిక

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య



చౌటుప్పల్ /అక్షిత న్యూస్: చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనలు, డీసీసీ కమిటీ ఆదేశాల మేరకు, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తంగడపల్లిలో 5, 6వ వార్డుల నూతన బూత్ కమిటీల ఏర్పాటు కార్యక్రమంను గురువారంనిర్వహించారు. ఈ సందర్భంగా 5వ వార్డు అధ్యక్షుడిగా బండి చంటి ముదిరాజ్ ని,6వ వార్డు అధ్యక్షుడిగా రావుల ఊషయ్య ని ఎన్నుకున్నట్లు మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేన రెడ్డి, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొగుదాల రమేష్ గౌడ్, డీసీసీ కార్యదర్శి బత్తుల లింగస్వామి గౌడ్, 6వ వార్డు ఇన్‌చార్జి, సింగిల్ విండో డైరెక్టర్ రావుల స్వామి, 5వ వార్డు ఇన్‌చార్జి కొండూరి ధర్మేంద్ర, మున్సిపల్ కమిటీ సభ్యులు ఇప్ప వెంకటేశం, ఎర్రగొని లింగస్వామి యాదవ్, సామకూర యాదయ్య, బండమీది మల్లేష్, అంతటి బాలరాజు, వర్కాల వెంకటకుమార్, సయ్యద్ వయ్యూద్దీన్, కారేదర్శి గుండెబోయిన ఐలయ్య యాదవ్, ఓర్సు రాజు. మున్సిపాలిటీ ముఖ్య నాయకులు కేతరాజు అచ్చయ్య, కొండూరు వెంకటయ్య, సామకూర రాజయ్య, బాలగొని వెంకటేశం, బొజ్జ బుచ్చయ్య, పందుల రాజేశ్, ముస్కు శ్యాంసుందర్ రెడ్డి, బెదరం లింగస్వామి, కేతరాజు గోపాలు, మహేష్, శ్రీకాంత్, కొల్కులపల్లి రాజశేఖర్, అనమోని వెంకటేశం, నక్క వెంకటేశం, నక్క శ్రీను, గట్టు వెంకటేశం, ఊదరి సురేష్, బండి రాజు, ఎర్రబోతు శేఖర్ రెడ్డి, బైరు సాయిరాం, వర్కాల శ్రీకాంత్, చిత్రాల రాజు, శ్యామల అనిల్, దోసపాటి శ్రీకాంత్, అనమోని రవి, అనమోని సంజీవ, ఎండీ సోయల్, ఎండీ ఇమ్రాన్, ఎండీ అబ్బాస్, కేతరాజు వెంకటయ్య, కర్తాల చంద్రయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.